"మగ మహారాజు ఎన్నయినా చేస్తాడు. మన దెలాంటి దేశం! సీత, సావిత్రి, సుమతులు పుట్టిన దేశం. మగాడేం చేసినా చూసీ చూడనట్టుండాలి."

ఆరోజు సుబ్బులు అత్తారింటికెళుతోంది. ఆరడుగుల సుబ్బారావు వెనక అయిదడుగుల సుబ్బులు భయం భయంగా ఒదిగొదిగి నిల్చుంది.

సుబ్బులుకి తల్లిదండ్రులంటే భయం. అన్నదమ్ములంటే భయం. బామ్మ కళ్ళెర్ర జేసినా, తాతయ్య గావుకేక పెట్టినా కూడా భయమే. ఇంకా చాలా భయాలున్నాయామెకి.

అక్కకొడుకు ఈలవేసినా, అన్నకూతురు అల్లరిచేసినా, ఇంటి దూడ రంకెవేసినా, పెంపుడుకుక్క అరిచినా, ఇంకా బల్లి, కప్ప, బొద్దింకల్లాంటి వాటిని చూసినా భయమే! అంతెందుకు భయం ముందుపుట్టి సుబ్బులు తర్వాత పుట్టింది.

అలాంటి సుబ్బులు, పల్లెలుతప్ప పట్నాలు కలల్లోనైనా చూడని సుబ్బులు కాంట్రాక్టరయిన భర్తతో పట్నానికెళ్ళిపోతోంది.

"అమ్మా! సుబ్బులూ! నువ్వసలే పిరికిసన్నాసివి. మీదా ఉమ్మడి కుటుంబం. ఎలా నెగ్గుకొస్తావో ఏమిటో!" అంటూ కంటతడి పెట్టుకుంటున్న తల్లిని బేలగా చూసింది సుబ్బులు.

"పదండి, పదండి! అవతల వర్జ్యం వచ్చేస్తుంది" అన్న తండ్రి మాటలకి కంగారుగా రెండెడ్ల బండికేసి నడిచింది.

బండి పొలిమేరలు దాటేదాకా జాగ్రత్తలు చెపుతూనే ఉంది తల్లి, బేలగా తలవూపుతూనే వుంది సుబ్బులు.

రైలెక్కించి తండ్రీ అన్నలూ కూడా వందజాగ్రత్తలు చెప్పి వీడ్కోలు తీసుకున్నారామెదగ్గర.

ఒంటరిగా భర్తతో వెడుతున్న సుబ్బులుకి కాస్త ఆనందంగానూ, కాస్త దిగులుగానూ వుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్," అన్నాడు సుబ్బారావు. తృళ్ళిపడి చూసింది సుబ్బులు.

"పట్నానికి రావడానికి భయపడుతున్నావా?" లాలనగా అన్నాడతను.

"ఊహూఁ!" సిగ్గుగా నవ్వింది సుబ్బులు.

♦ ♦ ♦

సుబ్బులు కాపరానికొచ్చాక ఆమె భయాలు రెట్టింపయ్యాయి. అత్తా, ఆడబడుచులకీ, తోడికోడళ్ళకి చాకిరీ చెయ్యడం ఆమెకి అంత కష్టమనిపించలేదుగానీ... వాళ్ళనే మాటలే కాస్త కష్టంగా తోచాయామెకి.

"ఏయ్! అయోమయం...ఎక్కడ చచ్చావ్?" ఇది భర్త ముద్దు పిలుపు.

"ఎంతసేపూ ఆ వీధిగుమ్మం పట్టుకుని వేళ్ళాడకపోతే కాస్త కొంపలో తగలడరాదూ..." ఇది అత్తగారి విసురు.

"వీధిలో అయితేనే ఈవిడగారి అందాల్ని అందరూ చూసేది" ఇది ఆడబడుచు జానకి అభిప్రాయం.

"మీకు తెలియదుగానీ అత్తయ్య! మన ఎదురింటి పోలీసినస్పెక్టరి దృష్టంతా ఈవిడగారిమీదే! మొన్న చూశాను. ఇద్దరూ ఒకర్నొకరు అలా తన్మయత్వంగా చూస్తూ నిల్చుండిపోయారు" తోడికోడలి గుసగుసలు!

ఇవన్నీ వింటూనే వుంటుంది సుబ్బులు. అందుకే ఆమెకి వీధిలో కెళ్ళాలంటే మరీ భయం.

రానురానూ సుబ్బులు ఆ యింట జీతం లేని నౌకరుగా తయారయింది. చివాట్లు లేందే ఆమెకి క్షణం గడవదు.

అడపా దడపా డబ్బుకోసం పుట్టింటికి పంపాడు భర్త డబ్బు తెమ్మని. ఒకటి రెండుసార్లు యిచ్చినా ఆపై ఇవ్వనన్నారు తల్లిదండ్రులు.

తిరుగుప్రయాణంలో వచ్చిన భార్యని చూసి—

"డబ్బు తెచ్చావా?" అన్నాడు సుబ్బారావు.

"ఉహూ" భయంగా అంది సుబ్బులు.

"ఏం?" అరచాడతను.

"అమ్మ ఇవ్వనంది!"

అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు సుబ్బారావు. వెంటనే నాలుగుతిట్లు మళ్ళీ పంపాడు.

అదే వేగంతో వచ్చేసింది సుబ్బులు వట్టిచేతులతో. అలా పుట్టింటివారూ, భర్తా బాల్‌లా ఆడుకున్నారామెని కొన్నాళ్ళు.

విసిగిపోయిన సుబ్బులు—

"ఇంక నేను వెళ్ళను" అనేసింది.

ఆవేశం పట్టలేని సుబ్బారావు ఆమెని జుట్టుపట్టుకుని వంచి వీపుమీద నాలుగు గుద్దులు గుద్దారు.

"ఏదో నాలుగు డబ్బులు రాల్తాయనిగానీ, లేకపోతే నీ చదువును చూశా—ధైర్యసాహసాలు చూశా నిన్ను చేసుకున్నది" అంటూ రంకెలు వేశాడు.

సుబ్బులు నోరు విప్పలేదు.

"ఏమే! అలా మూగిదెయ్యంలా వుండకపోతే నీనా బాబుదగ్గరికెళ్ళి నీ వాటా పంచియ్యని అడగలేవూ? ఓ మూల చెల్లెలిపెళ్ళి చెయ్యాలని వాడు ఆరాటపడుతుంటే కట్టుకున్న దానివై వుండి ఆ మాత్రపు కనికరం చూపించలేవు?" అంటూ విరుచుకుపడింది అత్తగారు.

దానికీ నోరు తెరవలేదు సుబ్బులు.

తిట్టి తిట్టి అలిసిపోయిన తల్లీకొడుకులు సుబ్బులు నెత్తిన రెండు మొత్తి మరీ పోయారు.

ఆరోజు అంతా కట్టకట్టుకుని సినిమాకి వెళ్ళారు ఒకరా—

జానకి. సుబ్బుల్ని రమ్మన్నూ లేదు. ఆమె వస్తానన్నూ లేదు. ఆమె తనగదిలో పడుకుని యేదో పుస్తకం చదువుకుంటూంది వంటపని ముగించుకుని. ఎనిమిదవుతూండగా వంటింట్లో ఏదో చప్పుడయి వచ్చి లైటేసిన సుబ్బులు అక్కడ కనిపించిన దృశ్యానికి కొయ్యబారిపోయింది.

పక్కింటి రాంబాబు ఒళ్ళో దాదావు నగ్నంగా జానకి! అకర్ణించి తప్పుకోవాలన్న ధ్యాసకూడా లేకుండా అలా నిల్చుండిపోయింది సుబ్బులు.

ఆమె తేరుకుని చూసేసరికి రాంబాబు మాయమై పోయాడు, జానకిమాత్రం నిప్పులు చెరిగే కళ్ళతో చూస్తూ నిల్చుంది.

ఇప్పుడు ఆమె వంటినిండా బట్టలున్నాయి.

"ఇప్పుడేం చూశావు?" కొట్టినట్టు అడిగింది.

"అదే...నువ్వూ రాంబాబూ!"

"ఆగు!" గద్దించింది జానకి.

"ఇప్పుడు చూసింది నువ్వు పూర్తిగా మర్చిపోవాలి."

"అలాగే" అన్నట్టు తలూపింది సుబ్బులు.

"మర్చిపోకపోతే ఏం జరుగుతుందో తెలుసా?"

బెదురుగా చూసిందామె.

"ఎదురింటి ఇన్స్పెక్టర్‌కి, నీకూ సంబంధం వుందనీ, నా కళ్ళారా చూశాననీ నీ మొగుడితో చెప్తాను,"

"అమ్మో!" భయంతో ఒణికిపోయింది సుబ్బులు.

"హుఁ!" విసురుగా వెళ్ళిపోయింది జానకి.

అలా రకరకాలుగా స్వారీచేస్తున్నారామెమీద. కావాలని ఆమెమీద బొద్దింకలు, బల్లులు పడెయ్యడం, ఆమె కంగారుగా పరిగెడుతుంటే అరిచి అల్లరిచెయ్యడం, ఆమె నిస్సహాయంగా ఏడుస్తూంటే పడీ పడీ నవ్వడం ఆ ఇంట్లోని వారందరికీ ఓ వేడుకై పోయింది.

అంతటితో ఆగలేదు.

ఓరోజు సుబ్బారావు ఓ బజారుస్త్రీని సరాసరి ఇంటికే తీసుకొచ్చేశాడు. యేడుస్తూ అత్తగారికి చెప్పబోతుంటే—

"బావుంది. మగమహారాజు! ఎన్నయినా చేస్తాడు. మీ మామగారి కాలంలో ఆయనకి పాతికమంది స్త్రీలతో సంబంధం వుండేది. నేను నోరెత్తేదాన్నా? అయినా మనదెలాంటి దేశం? సీతా, సావిత్రి, సుమతులు పుట్టిన దేశం! ఇలాంటివన్నీ కాస్త చూసీ చూడనట్టుండాలి. అంతేగానీ యిలాగే చూసుకుంటే... అసలికట్టణించే తరిమెయ్యగలడు జాగ్రత్త." అంటూ పెద్ద లెక్చరిచ్చిందావిడ.

మనసులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నా సుమతి కథని గుర్తుకు తెచ్చుకుని—

"నిజమే." అనుకుని తననితాను ఓదార్చుకుంది సుబ్బులు.

తరవాత్తర్వాత తరచూ యెవరో ఒకర్ని ఇంటికి తీసుకు రావడం, భార్యచేత వాళ్ళకి చాకిరీలు చేయించడం, వాళ్ళ

ముందే ఆమె ననుమానించి పగలబడి నవ్వడం, భార్యముందే వాళ్ళతో మోటు సరసాలాడ్డం అలవాటైపోయింది సుబ్బారావుకి.

ఇంట్లో అందరికి ఆమె ఒక ఆట వస్తువైపోయింది.

పనిమనిషి ద్వారా ఆ ఇంటి చరిత్రను గురించి విన్న ఎదరింటి ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి మాత్రం ఆమె పట్ల అంతు లేని సానుభూతి! కానీ ఆమె వోదార్చడానికి ఆ ఇంట ఎవరికీ అవకాశం రాలేదు.

ఎప్పుడయినా అనుకోకుండా తటస్థపడితే, తననిచూసి భయంతో రెపరెపలాడే ఆమె విశాలనేత్రాల్లోకి సభ్యతని కూడా మర్చిపోయి అలాచూస్తూండిపోయేవాడు ఇన్‌స్పెక్టర్.

అప్పుడు మరీ బెదిరిపోతూ చూసేవాామె కళ్ళు.

*   *   *

కాలం గడిచిపోతోంది.

జానకీ రాంబాబుల ప్రణయం విచ్చలవిడిగా సాగిపోతోంది.

సుబ్బారావూ, సారకాంతల శృంగారం శృతిమించిపోతోంది.

ఎన్ని చూసినా తనకు పట్టనట్టు నిమిత్తమాత్రంగా ఉండిపోయింది సుబ్బులు.

అవును మరి! ఆమె పతివ్రత!

సావిత్రీ సుమతులు పుట్టిన పుణ్యభూమిలో జన్మించిన సుబ్బులు ఆమాత్రం పాతివ్రత్యం చూపించాల్సిందే!

* * *

"ఏమే దెయ్యం." హాల్లోంచి అరిచాడు సుబ్బారావు.

చేతిలోని పనినలా వదిలేసి పరిగెత్తుకొచ్చింది సుబ్బులు. మేడమీద కెళ్ళబోతున్న భర్త, అతని భుజానికి వేళ్ళాడుతున్న ఓ అంగన.

"ఏమిటి?" అన్నట్టు చూసింది సుబ్బులు.

"ఇదిగో! ఈ బట్టలు ఉతికారెయ్!" ఆమెమీదికి రెండు చీరలు విసిరింది ఆ అంగన.

"ఏం వినిపించిందా?" అరిచాడు భర్త.

మౌనంగా తలూపింది సుబ్బులు.

"యేం డార్లింగ్! నీ పెళ్ళానికి మాటలు రావా?" వయ్యారంగా అందామె.

"మాటలు రాక కాదు. పొగరు." చేతిలోని బౌండ్ పుస్తకం భార్య ముఖానికేసి కొడుతూ అన్నాడు సుబ్బారావు.

కిసుక్కున నవ్విందా యువతి.

కిక్కురు మనలేదు సుబ్బులు.

"యేం! నీకే చెప్పేది." మళ్ళీ అరిచాడతను.

"ఆ!" కంగారుగా అనేసి చీరలు తీసుకుని పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది సుబ్బులు.

వెనకనించి వాళ్ళిద్దరి నవ్వులు అలలు అలలుగా సాగి ఆమెని ఒణికించేశాయి.

మౌనంగా బట్టలు ఉతికి ఆరేసింది.

ఆ రాత్రి తల్లీ కొడుకులు గుసగుసలాడుకోవడం అదీ తనని గురించే అవడంతో బిత్తరపోయింది సుబ్బులు.

"కొంపతీసి తనని పుట్టింటికి పంపెయ్యరుకదా?" అను కుంది భయంగా.

*   *   *

"సుబ్బులూ!"

వంటరిగా కూర్చుని యేదో ఆలోచిస్తున్న సుబ్బులు త్రుళ్ళిపడింది.

ఎదురుగా భర్త!

చిరునవ్వుతో చూస్తున్న భర్త!

గభాల్న లేచింది.

దెయ్యం, భూతం, అయోమయం లాంటి పేర్లతో తప్ప పేరుపెట్టి పిల్చి చాలా రోజులే అయిందా ఇంట్లో.

"ఏమిటి? వంట్లో బాగా లేదా?" ఆప్యాయంగాఅన్నాడు సుబ్బారావు.

బిత్తరపోయింది.

సూర్యరశ్మికి కరిగిపోయిన మంచులా ఆమెలోని బింకం కరిగిపోయింది. అరచేతుల్లో మొహం దాచుకుని భోరుమంది.

"ఛ! ఛ! ఏమిటిది?"అంటూ దగ్గరకి తీసుకుని ఓదార్చా

డతను. తన ప్రవర్తనకి క్షమించమన్నాడు. ఇన్నాళ్ళూ ఆమె విలువ తెలుసుకోనందుకు తెగ బాధపడిపోయాడు.

చాలా రోజుల తర్వాత భర్త గుండెలమీద హాయిగా నిద్రపోయింది సామాన్య భారతనారి సుబ్బులు.

*　　*　　*

ఉదయం పదకొండు గంటలయింది.

అందరి భోజనాలు అయిపోయాయి. సుబ్బారావు ఆఫీసుకెళ్ళిపోయాడు.

ఒక్క ముసలావిడ తప్ప...ఆడబడుచు, తోడికోడళ్ళు, వారిభర్తలు పన్నెండుగంటలాట సినిమాకెళ్ళారు.

సంతోషాతిశయంతో తలారా స్నానంచేసి బారెడు జుట్టును ఒదులుగా జడల్లుకుని కడిగిన ముత్యంలా వుంది సుబ్బులు.

పన్నెండవుతూండగా సుబ్బారావొచ్చాడు.

"అరె! ఆఫీసుకెళ్ళలేదూ!" అంది సుబ్బులు.

"ఊఁహుఁ" నవ్వాడతను.

ఏదో అనబోయి భర్తవెంట మరో వ్యక్తి వుండడంతో చటుక్కున లోపలికెళ్ళిపోయింది సుబ్బులు.

"అరె సుబ్బులూ, వెళ్ళకు! ఈయన మా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారు—మనింటికి టీకి పిల్చాను. ఈమె నా భార్య" అంటూ ఒకరొకరికి పరిచయం చేశాడు సుబ్బారావు.

కంగారుగా నమస్కరించి—

"అత్తయ్యగార్ని పిలుస్తాను" అంటూ వెళ్ళబోతున్న భార్య నాపేశాడు సుబ్బారావు.

"అమ్మ నిద్రపోతున్నట్టుంది-లేపకు. కాస్త కాఫీ టిఫిన్ నువ్వే చెయ్యి" అంటే గబగబా వెళ్ళి కాఫీ టిఫిన్ తయారు చేసింది సుబ్బులు. ఇద్దరికీ చెరో ప్లేటూ అందించింది.

అతిథి తమ పడగ్గదిలో, తమ మంచంమీద కూర్చో వడం సుతారమూ నచ్చలేదామెకి. అయినా అదికాదనే ధైర్యంగానీ, చొరవగానీ లేదామెకి.

"సుబ్బులూ! ... మీరు మాట్లాడుతూండండి, నే నిప్పుడే వస్తాను" అంటూ వంటింటికేసి వెళుతున్న భర్తని చూసి బిత్తరపోయింది.

"కూర్చో" అన్నాడు అతిథి అమర్యాదగా. అతన్నించి బ్రాందీవాసన గుప్పుమంటోంది.

"ఫరవాలేదు. మీరు తింటూండండి! నేను ఇప్పుడు వస్తాను" అంటూ కంగారుగా బయటికి రాబోతున్న ఆమెని చెయ్యిపట్టి ఆపేశాడతను.

"వదలండి" విదిలించుకోబోయింది ఆమె.

"వదలడానికాదు పట్టుకుంది" వెకిలిగా నవ్వా డతను.

హడలిపోయిన ఆమె బలంగా చెయ్యిని విదిల్చుకుని ఒక్క అంగలో వంటింట్లోకొచ్చి పడింది.

మనిషి నిలువెల్లా వణికిపోతోంది.

"ఏమిటి?" మొహం చిట్లించాడు సుబ్బారావు.

"అతను నా చెయ్యి..." దుఃఖంతో ఆమెకి మాట రావడంలేదు.

"ఓస్ అంతేకదా!" నవ్వేశాడతను.

బిత్తరపోయింది ఆమె.

"అవును సుబ్బులూ! అతను నిన్నొకసారి చూశాట్ట. నీలా అమాయకంగా వుండేవాళ్ళన్నా, బిత్తర చూపులుచూసే వాళ్ళన్నా అతనికెంతో ఇష్టంట. అందుకే..."

"అందుకే?" భయంగా చూసిందామె.

"మరేంలేదు. ఇవాళ అతనితో నువ్వు సరదాగా గడిపెయ్యి."

"ఛ ఛ!" అప్రయత్నంగా అంది ఆమె.

"ఈ సభ్య సమాజంలో యిదేమంత తప్పుకాదు సుబ్బులూ! భర్తని నేను చెపుతున్నాను కదా. నువ్వు 'ఊఁ' అంటే మనకి చాలా కాంట్రాక్టులు వస్తాయి లక్షలకి లక్షలు..."

అతనిమాట పూర్తికానేలేదు.

"డబ్బుకోసం యింత నీచమయినపని చేస్తారా?" అంది సుబ్బులు తెల్లబోతూ.

"ఇందులో నీచమయిన పనేముంది?" అంటూ ఎన్నో విధాల నచ్చజెప్ప చూశాడు సుబ్బారావు.

అయితే ఆమె అంగీకరించలేదు.

అతనికి పిచ్చకోపం వచ్చేసింది.

"ఇప్పుడు నిన్ను బలవంతంగా ఆయనదగ్గిరికి పంపితే నీ బాబెవడడ్డొస్తాడే?" కోపంగా అరిచాడు.

"ఇంతటిదానికి నా బాబుదాకా అక్కర్లేదురా. నేను చాలు" తాపీగా అంది ఆమె.

"ఏమిటే?" బిత్తరపోయాడు అతను.

"అవున్రా! నన్ను నేను రక్షించుకోగలను" పెద్దగా నవ్విందామె.

"ఏమిటి నన్ను ఏరా అంటావా?" దూకుడుగా ముందుకు రాబోయాడతను.

"ఆగు!" అరిచిందామె.

అంతటి మగాడూ ఆమెని చూసి క్షణం జంకాడు— ఇంతలో ఈ హడావిడికి గదిలోంచి బయటికొచ్చాడు అతిథి. అతన్ని చూశాక కాస్త ధైర్యం వచ్చింది అతనికి.

"దాన్ని పట్టుకోండి సర్! అది మాటలతో లొంగదు" విలన్‌లా అన్నాడు.

ఇంజనీర్ ముందుకు రాబోయాడు.

గభాల్న అక్కడున్న కత్తిపీట అందుకుంది సుబ్బులు. "అడుగు ముందుకేశారంటే చంపేస్తాను!" భద్రకాళిలా అరిచింది.

మగాళ్ళిద్దరూ నిశ్చేష్టులై పోయారు.

ఇంజనీర్ మైకంలోనే మెల్లిగా వెళ్ళి ఒడుపుగా ఆమెని పట్టుకోబోయాడు.

అంతే! అతను భయంకరంగా అరుస్తూ నేల కూలిపోయాడు.

"ఎంతపని చేశావే రాక్షసీ!" అంటూ ముందుకురాబోయిన సుబ్బారావుకీ అదేగతి పట్టింది.

అంతవరకూ తన గదిలో నిద్ర నటిస్తున్న అత్తగారు రెండు చావుకేకలు వినిపించి కంగారుగా వచ్చి, అక్కడ కనిపించిన దృశ్యంచూసి కొయ్యబారిపోయింది.

నెత్తురు మడుగులో కొట్టుకుంటున్న కొడుకు, అతిథి, నెతురుచిమ్మి బట్టలన్నీ రక్తసిక్తమైపోగా చేతిలో కత్తిపీటతో అపర ఆదిశక్తిలా వున్న సుబ్బులు.

"ఓసి పాపిష్టిదానా! ఎంతపనిచేశావే!" అంటూ ముందుకు రాబోతున్న అత్తగార్ని-

"ఆగు!" అన్న చిన్న గద్దింపుతో హడలగొట్టేసింది సుబ్బులు.

"ఇప్పుడు చెప్పు. నేను చేసిందాంట్లో తప్పేముందో?" శాంతంగా అంది.

"తప్పా అంటున్నావా ఇంకా...కట్టుకున్నవాణ్ణి కత్తిపీటతో నరికి, ఉండు-నిన్నేం చేస్తానో" ఆవేశంగా, బింకంగా రాబోయిందావిడ.

"ఇద్దరు మగాళ్ళు చెయ్యలేనిది నువ్వేం చేస్తావే. ముసలికాకా-. ముందు అడ్డుజరుగు." ఈనిన పులిలా అరచింది సుబ్బులు.

హడలిపోతూ పక్కకి తప్పుకుంది ముసలావిడ.

"నా సహనం ఈనాటితో సరి. ఇన్నాళ్ళూ చేతగాక ఊరుకోలేదే! ఆడదానిలో యెంత సహనం ఉంటుందో మీకు తెలియజెప్పానంతే.

ఆడదంటే అబలేకాదు. అవసరం అయితే ఆదిశక్తి కాగలదని ఈనాడు నిరూపించి మరీ చూపాను. నువ్వూ ఆడ జన్మ ఎత్తావ్! కానీ యేం చేశావ్? కోడల్ని కాలరాచావ్, కూతురు, కొడుకు ఇంట్లో కళ్ళుముందే వెధవపన్లు చేస్తుంటే ఓ వేశ్యదూతలా ఆనందించావ్! నీ మూలంగా స్త్రీ జాతికే అవమానం. నువ్వు బ్రతకకూడదు.

ఇద్దరు మగాళ్ళని చంపిన నాకు నిన్ను చంపడం ఓ సమస్యకాదు కానీ నిన్ను నేను చంపను. ఎందుకంటే నువ్వంత తేలిగ్గా చావకూడదు.

నీ చరిత్రంతా పేపర్లకెక్కాలి. నలుగురూ మీ దారుణాల్ని కథలు కథలుగా చెప్పుకోవాలి. మీరందరూ తలెత్తుకోలేక కుళ్ళి కుళ్ళి చావాలి. ఇక్కడ జరిగినవన్నీ చెప్పిగానీ నేను ఉరికంభం యెక్కనే." అంటూ నేలమీద పడి గిలగిల కొట్టుకుంటున్న ఇద్దరు మొగాళ్ళనీ ఓసారి కాలితో తన్ని కాండ్రించి వుమ్మేసి అలా కత్తిపీటతో సహా పోలీస్టేషన్ కేసి నడిచింది.

అంతా బిత్తరపోయారామె అవతారం చూసి. పోలీసులు సైతం కంగారు పడ్డారు.

సూటిగా చూస్తూన్న ఆమె కళ్ళని చూసి బిత్తర పోయాడు ఎదురింటి ఇన్‌స్పెక్టర్.

ఆమె కళ్ళలో భయం, బెరుకుల్లాంటివేం లేవు.

ఒకలాంటి తృప్తి, ధైర్యం, గర్వం, ఆత్మస్థయిర్యం తొంగిచూస్తున్నాయి.

"ఇన్‌స్పెక్టర్! నేను రెండు హత్యలు చేశాను. నన్ను అరెస్టు చెయ్యండి" అంటూ నవ్వుతూ చేతులు చాచిన ఆమెని చూసి మరీ కంగారు పడిపోయాడంత ఇన్‌స్పెక్టరూ.

( పల్లకి సచిత్ర వారపత్రిక )

—o—